
సాక్షి కర్నూలు

బుధవారం, 1, అక్టోబర్, 2025



ప్రైవేటీకరిస్తే ఊరుకోం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోమని, తీవ్ర పరిణామాలను ఎదుర్కోవా ల్సి వస్తోందని రాజకీయ, ప్రజా, యువ జన సంఘాలు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. IIలో▸



కనుల పండువగా తెప్పోత్సవం


రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నేతృత్వంలో మంత్రాలయంలో వెలసిన మంచాలమ్మ అమ్మవారి తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. IIలో▸



అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

మండల కేంద్రం సంజామలలో మంగళవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ కాల్వలోకి దూసికెళ్లింది. బస్సులో దాదాపు 90 మంది ప్రయాణికులు ఉన్నారు. IIలో▸

ఒక్కటే టెన్షన్



పింఛనుదారుల గుండెల్లో గుబులు

- ఉమ్మడి జిల్లాలో 8,911 పింఛన్ల రద్దుకు నోటీసులు
- దివ్యాంగుల ఆందోళనలతో దిగొచ్చిన ప్రభుత్వం
- అయినప్పటికీ 1వ తేదీ వస్తుందంటే భయమే..
- ఇప్పటికే గుట్టచప్పుడు కాకుండా 13,629 పింఛన్ల కోత
- అతీగతీ లేని 50 ఏళ్లకే పింఛను హామీ

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలవుతోంది. ఈ మధ్య కాలంలో ఒక్కటంటే ఒక్కటీ కొత్త పింఛను ఇవ్వని పరిస్థితి. కొత్త పింఛన్ల కోసం ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. వేలాది మంది నిరీక్షిస్తున్నారు. కొత్త పింఛన్‌లు ఎప్పుడంటూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. రెండు లక్షల మందికి పైగా వృద్ధులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారంటే ఈ ప్రభుత్వం ఏస్థాయిలో మోసగిస్తుందో అర్థమవుతోంది. పైగా అనర్హత పేరిట దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు చర్యలు చేపట్టడం గమనార్హం. పింఛన్ల వల్ల దివ్యాంగులు సమాజంలో గౌరవంగా బతకగలుగుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వేలాది దివ్యాంగుల నోటికాడి ముద్దను లాగేసే ప్రయత్నం చేస్తోంది. అక్టోబర్ నెల పింఛన్లు బుధవారం పంపిణీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 4,748, నంద్యాల జిల్లాలో 4,163 ప్రకారం ఉమ్మడి జిల్లాలో 8,911 దివ్యాంగుల పింఛన్లపై అనర్హత వేటు వేసి ఆగస్టులో నోటీసులు కూడా అందించారు. అర్హత ఉన్నప్పటికీ తొలగింపుల నోటీసు ఇవ్వడంపై వేలాది మంది అప్పీల్ చేసుకున్నారు. దీంతో వెనక్కు తగ్గిన ప్రభుత్వం సెప్టెంబర్ నెలలో దాదాపు అందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రకటించింది. అప్పీల్ చేసుకున్న వారి వికలత్వాన్ని మరోసారి పరిశీలిస్తామని.. అంతవరకు పింఛన్లు కొనసాగిస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయినప్పటికీ 1వ తేదీ వస్తుందంటే దివ్యాంగుల్లో టెన్షన్ మొదలవుతోంది. జాబితాలో తమ పేరు ఉంటుందో లేదోననే ఆందోళన కనిపిస్తోంది.

50 ఏళ్లకే పింఛను ఏమైంది!

సూపర్-6 హామీల్లో అత్యంత ప్రధానమైన హామీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని ప్రకటించడం. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించని పరిస్థితి. అయినప్పటికీ సూపర్-6 సూపర్ హిట్ అంటూ కూటమి ప్రభుత్వం హడావుడి చేస్తుండటం ప్రజల్లో నవ్వులపాలవుతోంది. వంచన చేసిన ముఖ్యమంత్రిపై 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వితంతు మహిళలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు

వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు ఇవ్వడం విశేషం. ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్‌లను అర్హులైన వారందరికీ మంజూరు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు కొత్త పింఛను ఇంటి తలుపు తట్టేది. వైఎస్‌ఆర్‌సీపీ ఐదేళ్ల పాలనలో కొత్త పింఛన్‌లు 1.20 లక్షలకుపైగా జారీ అయ్యాయి.

"చంద్రబాబు హామీ ఇప్పటికీ నెరవేరలేదు



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామన్నారు. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ప్రస్తుతం నాకు 53 ఏళ్లు. పింఛనుపై పెట్టుకున్న ఆశలను ప్రభుత్వం వమ్ము చేస్తోంది.

– ఓబులేసు, రామాపురం, తుగ్గలి మండలం

16 నెలలవుతున్నా కొత్త పింఛన్ల ఊసెత్తరు



నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడుస్తోంది. ఇప్పటి వరకు కొత్త పింఛన్ల ఊసెత్తడం లేదు. మాది బీసీ సామాజిక వర్గం. నా వయస్సు 55 ఏళ్లు. కూటమి నాయకులు సంబరాలు చేసుకుంటున్నారే కానీ కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తామని చెప్పడం లేదు. ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలో.

– గొల్ల వెంకటేష్, ముద్దటమాగి, హొళగుంద మండలం

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దివ్యాంగుల పింఛన్ల తొలగింపు ఇలా..

కర్నూలు జిల్లా	
దివ్యాంగుల పింఛన్లు	30605
రీ వెరిఫికేషన్	25903
అనర్హత వేటు	4731
దివ్యాంగుల నుంచి ఓఏపీగా మార్పు	674
అర్హత కలిగినవి	20498
హెల్త్ పింఛన్లు	413
పునః పరిశీలించినవి	412
అనర్హత వేటు పడింది	17
హెల్త్ నుంచి దివ్యాంగుల కేటగిరీకి మార్పు	169
హెల్త్ నుంచి వృద్ధాప్యంగా మార్పు	4
నంద్యాల జిల్లాలో	
దివ్యాంగుల పింఛన్	25256
రీ వెరిఫికేషన్	22411
అనర్హత వేటు	4099
దివ్యాంగుల నుంచి ఓఏపీగా మార్పు	719
హెల్త్ పింఛన్లు	873
పునః పరిశీలించినవి	873
అనర్హత వేటు పడింది	64
హెల్త్ నుంచి దివ్యాంగుల కేటగిరీకి మార్పు	323
హెల్త్ నుంచి వృద్ధాప్యంగా మార్పు	20

గుట్టుచప్పుడు కాకుండా 13,629 పింఛన్ల కోత

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతినెలా పింఛన్లలో కోత పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024 ఏడాది జూన్ నెలతో పోలిస్తే సెప్టెంబర్ నెల నాటికి 12,736 పింఛన్లు కోత కోశారు. ఈ ఏడాది జూన్ నెలలో 4,67,389 పింఛన్లు ఉండగా.. ఈ ఏడాది అక్టోబర్ నెలలో ఆ సంఖ్య 4,53,760కి చేరుకుంది. 16 నెలల కాలంలో గుట్టుచప్పుడు కాకుండా 13,629 పింఛన్లు తొలగించడం గమనార్హం.

న్యూస్‌రీల్

శ్రీజోగులాంబకు పట్టువస్త్రాల సమర్పణ



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

కర్నూలు(సెంట్రల్): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున అలంపూర్‌లో వెలసిన జోగులాంబా సమేత బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లకు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పట్టు వస్త్రాలను సమర్పించారు. మంగళవారం ఆమె అలంపూర్‌కు చేరుకొని తొలుత బాలబ్రహ్మేశ్వర స్వామికి అభిషేకం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్‌కు వేదపండితులు వేదాశీర్వచనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ వెంట దేవదాయ శాఖ ఏసీ బి.సుధాకరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు సీఐలకు స్థానచలనం

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. కర్నూలు అర్బన్ తాలూకాకు ఎస్‌బీలో పనిచేస్తున్న తేజమూర్తిని నియమించి అక్కడున్న శ్రీధర్‌ను ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేశారు. అలాగే కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న చిరంజీవి ఖాళీగా ఉన్న ఎమ్మిగనూరు రూరల్ పీఎస్‌కు నియమితులయ్యారు. అక్కడున్న మధుసూదన్‌రావు నెల రోజుల క్రితం డీఎస్పీగా పదోన్నతిపై వెళ్లారు. ఇదిలాఉంటే కర్నూలు అర్బన్ తాలూకా, ఎమ్మిగనూరు రూరల్ తాలూకా పోలీస్‌స్టేషన్ల పోస్టింగుల కోసం అధికారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. శ్రీధర్‌ను కర్నూలు రెండో పట్టణ స్టేషన్‌కు, అక్కడున్న నాగరాజరావును కర్నూలు అర్బన్ తాలూకాకు నియమించేందుకు మంత్రి అంగీకరించినప్పటికీ చివరి నిమిషంలో సమీకరణలు మారి తేజమూర్తి నియమితులయ్యారని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే ఎమ్మిగనూరు రూరల్ స్టేషన్‌కు కూడా ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు పోటీ పడ్డారు. జిల్లా పోలీసు శాఖలో డీఎస్పీ హోదాలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ అధికారికి టీడీపీ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే సిఫారసు లేఖతో చిరంజీవి ఎమ్మిగనూరు రూరల్ పోస్టింగ్ దక్కించుకున్నట్లు సమాచారం.

బిట్‌కాయిన్ పేరుతో బురిడీ

కర్నూలు: బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మబలికి ఓ మహిళను సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్న ప్రసన్న రాణికి అపరిచితుడు ఫోన్ చేసి బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో ప్రసన్నరాణి స్పందించి అతడు చెప్పిన బ్యాంకు ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.90 వేలు జమ చేసింది. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పీజీ రెండో విడత ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

కర్నూలు కల్చరల్: ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీలు, అనుబంధ పీజీ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద రెండో విడత పీజీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 4వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, వెబ్ కౌన్సెలింగ్‌కు ఫీజు చెల్లింపు, 5వ తేదీ వరకు అప్‌లోడెడ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 1 నుంచి 5వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడం, 6వ తేదీన వెబ్‌ఆప్షన్ల మార్పు, 8వ తేదీన సీట్ల కేటాయింపు, 8 నుంచి 11వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో రిపోర్టింగ్ చేయడం, 8వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని షెడ్యూల్‌లో ప్రకటించారు.

పీహెచ్‌సీలలో తాత్కాలిక వైద్యులతో సేవలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో వారి స్థానంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ తాత్కాలికంగా వైద్యులను సర్దుబాటు చేశారు. మొత్తం 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కర్నూలు మెడికల్ కళాశాలలోని పీజీ వైద్యులు, సీహెచ్‌సీ వైద్యులు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్లను సర్దుబాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఆయా పీహెచ్‌సీలకు వెళ్లి రోగులకు సేవలు అందించాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.


సిద్ధిదాయిని..వరప్రదాయిని



ఆలయ ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

- సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీశైల భ్రమరాంబాదేవి
- కైలాస వాహనంపై విహరించిన భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు దేదీప్యమానంగా సాగుతున్నాయి. దసరా మహోత్సవాల్లో మంగళవారం సిద్ధిదాయిని స్వరూపంలో భ్రమరాంబాదేవి, కైలాస వాహనంపై భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు విహరించి భక్తులను కరుణించారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీశైల భ్రమరాంబాదేవిని సిద్ధిదాయిని అలంకారంలో అలంకరించి అమ్మవారి ఆలయం ముందుభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వేదికపై ఉంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా హారతులిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్లను కైలాస వాహనంపైకి చేర్చి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సిద్ధిదాయిని అమ్మవారిని, కైలాస వాహనంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. కళాకారుల విచిత్ర వేషధారణలు, నృత్యాలతో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆయా పూజా కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.



కైలాస వాహనధీశులైన స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీశైలంలో నేడు..

దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం భ్రమరాంబాదేవి రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారంలో, అశ్వవాహనంపై భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్‌తో పాటు శ్రీశైలం ఎమ్మెల్యే స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

2029 ఎన్నికల్లో దళితుల సత్తా చూపుతాం

వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే ఓటు ద్వారా బుద్ధి చెబుతాం

- పీపీపీ విధానంతో పేద, సామాన్యులకు వైద్య విద్య దూరం
- ప్రైవేటీకరణ విరమించుకోకుంటే ఆమరణ నిరాహార దీక్షలకు సిద్ధం
- కర్నూలులో భారీ ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు
- నిరసనగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(టౌన్): దళిత పిల్లలకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దళితుల సత్తా ఏంటో చూపిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోల్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ కొండారెడ్డి బురుజు మీదుగా పాతబస్టాండ్ వరకు సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డౌన్ డౌన్, పేదల వ్యతిరేకి సీఎం అంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రభుత్వ తీరుకు నిరసనగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేలంపాడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో అప్పులు, ప్రభుత్వ ఆస్తులు అమ్మడమే పనిగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో సదుద్దేశంతో రాష్ట్రంలో ఒకేసారి 17 ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేస్తే ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహణ చేతకాదని తప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పీపీపీ విధానాన్ని తీసుకువచ్చి రూ.వేల కోట్ల వైద్య కళాశాలల భూములు తమ్ముళ్లకు దారాదత్తం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలన్న డిమాండ్‌తో దశల వారీ ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.




అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

➡ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రైల్వే ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రకంటి కిషన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం మాల మాదిగలను మోసం చేసేందుకే పీపీపీ విధానాన్ని అమలు చేస్తోందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. రాష్ట్రంలో దళిత పిల్లలకు విద్య, వైద్యాన్ని పూర్తిగా దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. వైద్య కళాశాలలే కాకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందే అవకాశాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే దళితులంతా ఏకమై ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

➡ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు కమతం పరుశరాం, సి.హెచ్.మద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం విద్యను సర్వనాశనం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో చదువులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోగలిగారన్నారు. ఈ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో డిగ్రీ కళాశాలలు మూతపడి విద్యార్థులు రోడ్ల పాలయ్యే పరిస్థితి నెలకొందన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనమరకల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రభుదాస్, అవతారం, జిల్లా కార్యదర్శి గంధం చంద్ర, మంత్రాలయం ఇన్‌చార్జి జయపాల్, ఆదోని ఇన్‌చార్జి ఏసేపు, ఆర్‌టీఐ నగర అధ్యక్షులు గద్ద రాజశేఖర్ బాబు, యాక్టివిటీ కమిటీ జిల్లా కార్యదర్శి జగ్గుల లాజర్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు హరి, జిల్లా ఉపాధ్యక్షులు ఏసు, కార్యదర్శి శ్రీకాంత్, శివ, కటారి సురేష్, చందు, యోగి తదితరులు పాల్గొన్నారు.


94 శాతం అధిక వర్షపాతం



కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నాయి. గత సెప్టెంబర్ నెల రికార్డు స్థాయిలో 94 శాతం అధిక వర్షపాతం నమోదైంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు హొళగుంద, చిప్పగిరి మండలాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. మంత్రాలయంలో అత్యధిక వర్షపాతం, మద్దికెరలో అత్యల్ప వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 19.2 మి.మీ వర్షం కురిసింది. వరుసగా రెండు నెలలు అధిక వర్షపాతం నమోదవుతుండటంతో పంటల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రధానంగా ఉల్లి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆస్పరి మండలం యాటకల్ గ్రామంలో ఎంకప్ప అనే రైతు 400 బస్తాల ఉల్లిని వంకలో పారబోశారు. క్రిష్ణగిరి మండలం ఆలంకొండ గ్రామానికి చెందిన మూలింటి మనోజ్ ఉల్లిని కొనేవారు లేకపోవడం, అధిక వర్షాలతో కుళ్లిపోతుండటంతో రోడ్డు పక్కన పారబోయడం గమనార్హం.

మండలం	వర్షపాతం(మి.మీ)
మంత్రాలయం	53.4
పెద్దకడుబూరు	49.4
గోనెగండ్ల	43.8
ఎమ్మిగనూరు	36.4
కౌతాలం	32.4
కోసిగి	30.6
నందవరం	30.2
ఓర్వకల్	30.2
కోడుమూరు	27.4
కల్లూరు	25
సీ.బెలగల్	20.6

బన్ని ఉత్సవంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు




ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: దసరా పండుగను పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ జరిగే దేవరగట్టు మాలమల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని,ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బన్ని ఉత్సవానికి 800 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసిందన్నారు. అల్లర్లకు పాల్పడటం నిప్పులు విసరడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రింగుల కర్రలతో బన్ని ఉత్సవంలో పాల్గొనడం వల్ల కలిగే దుష్పరిణామాలపై దేవరగట్టు చుట్టుప్రక్కల గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ కూడా చేపట్టి గతంలో ఘర్షణలకు పాల్పడ్డ వారిని, అక్రమ మద్యం రవాణా చేసినవారిని గుర్తించి 195 మందిని బైండోవర్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బన్ని ఉత్సవంలో ఫైర్, వైద్య, అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

భారీ బందోబస్తు...

ఏడుగురు డీఎస్పీలు, 50 సీఐలు, ఆర్‌ఐలు, 59 మంది ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, 95 మంది ఏఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 200 మంది సివిల్ ఏఆర్ కానిస్టేబుళ్లు, 18 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 90 మంది హోంగార్డులను బన్ని ఉత్సవం బందోబస్తు విధులకు నియమించినట్లు ఎస్పీ వెల్లడించారు.

కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సత్యనారాయణరెడ్డి



కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం. సత్యనారాయణరెడ్డి నియమితులయ్యా రు. ఆయన గత కొన్నేళ్లుగా ఆసుపత్రిలో ఆప్తమాలజి ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా కొనసాగిన డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేయడంతో సత్యనారాయణరెడినియమించారు. 1998లో ఆయన కంటి ఆసుపత్రిలో మొబైల్ మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. 1999లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా,1997లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2022లో అనంతపురానికి బదిలీ అయ్యారు. మరుసటి సంవత్సరం ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది తిరిగి కర్నూలుకు బదిలీపై వచ్చారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం



కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామం వద్ద ఎమ్మిగనూరు వెళ్లే రోడ్డు పక్కన పొలాల్లో గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యమైంది. మృతుడికి 40 ఏళ్ల పైబడి ఉండి ఎర్రటి, నల్లటి రంగులు గల టీషర్ట్, బూడిద కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈయన అచూకీ తెలిసిన వారు కోడుమూరు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ ఎర్రిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. కాగా మృతుడు మతిస్థిమితం లేకుండా చుట్టుపక్కల పరిసరాల్లో తిరుగుతుండేవాడని గ్రామస్తులు తెలిపారు.

కాల్వలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



సంజామల: మండల కేంద్రం సంజామలలో మంగళవారం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ కాల్వలోకి దూసికెళ్లింది. కోవెలకుంట్ల డిపోకు సంబంధించిన ఈ బస్సు తాడిపత్రి నుంచి కోవెలకుంట్లకు వస్తుండగా సంజామల ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని టర్నింగ్ వద్ద ద్విచక్రవాహనాన్ని తప్పించబోగా ఈ ఘటన జరిగింది. బస్సులో దాదాపు 90 మంది ప్రయాణికులు ఉన్నారు. వారికి ఎటువంటి ప్రమాదం కాలేదు. కాల్వలోకి దూసికెళ్లిన బస్సును జేసీబీ సహాయంతో బయటకు తీశారు. అనంతరం బస్సును కోవెలకుంట్ల డిపోకు తరలించారు.

శ్రీశైలం రుద్రపార్కులో పాము కలకలం



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని రుద్ర పార్కులో పాము కలకలం రేపింది. మంగళవారం రుద్ర పార్క్‌లో పాము సంచారాన్ని తెలుసుకున్న దేవస్థాన సీఎస్ఓ శ్రీనివాసరావు స్నేక్‌క్యాచర్, దేవస్థాన ఉద్యోగి రాజాకు సమాచారం అందించారు. తక్షణమే ఆయన ఘటనా స్థలానికి చేరుకుని పామును పట్టుకుని, అడవిలో వదిలేశారు.

అహోబిలేశుడి సేవలో తమిళనాడు హైకోర్టు జడ్జి



అహోబిలం క్షేత్ర విశిష్టతను తెలుసుకుంటున్న న్యాయమూర్తి

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిటి ఆశ మంగళవారం దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆమెకు ఆలయ మర్యాదల్లో భాగంగా ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలు అందించారు.

ఒక్క కలం పోటుతో ప్రైవేట్‌కు అప్పగించారు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకొచ్చి నిర్మాణాలు చేపట్టారు. అందులో 2023-24 విద్యా సంవత్సరంలోనే 5 కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. పులివెందుల, పాడేరు కాలేజీల నిర్మాణాలు పూర్తి అయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన 10 కాలేజీల నిర్మాణ పనులు 50-80 శాతం వరకు జరిగాయి. అయితే ఈ సమయంలో వాటిని పూర్తి చేయకుండా చంద్రబాబు నాయుడు ఒక్క కలం పోటుతో పీపీపీ పేరుతో ప్రైవేట్‌కు అప్పగించారు. ఇది దారుణమైన అంశం.

– శివనాగిరెడ్డి, స్పార్క్ కన్వీనర్

దోచుకోవడానికే ప్రైవేటీకరణ

చంద్రబాబునాయుడు తన అనుచరుల సంపద సృష్టి కోసమే వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారు. 80 శాతం ప్రభుత్వ నిధులతో పూర్తి చేసిన కాలేజీల నిర్వహణ బాధ్యతను ప్రైవేట్‌కు ఇవ్వడం దారుణం. అంటే సోమ్ము ప్రభుత్వానిదైతే..సోకు మాత్రం ప్రైవేట్ వారిది అవుతుంది. ఈవిధానంలో పేదలకు ఉచిత వైద్యం అందదు. పభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్వహించాలి.

– తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దూరదృష్టితో వైఎస్ జగన్ మెడికల్ కాలేజీలు తెచ్చారు

సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూర దృష్టితో ఒకేసారి 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించారు. వాటిని పూర్తి చేయాల్సిన చంద్రబాబునాయుడు ప్రైవేట్‌కు అప్పగించి సొమ్ము చేసుకునేందుకు చూస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి. కర్నూలు జిల్లాలో ఆదోని మెడికల్ కాలేజీ పూర్తి అయితే ఆ ప్రాంత ప్రజలకు వైద్యం పరంగా ఎంతో మేలు జరుగుతుంది.

– శివకుమార్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబుపై నమ్మకం సడలుతోంది

చంద్రబాబు నాయుడు ఎంతో దూర దృష్టి కల వారని అనుకునే వాడిని. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తూ ఆయన జీవోలు జారీ చేయడంతో నమ్మకం సడులుతోంది. ఆయన తన అనుచరుల కోసం ప్రభుత్వ ఆస్తులను రూపాయికే ఎకరా భూమిని ప్రైవేట్‌కు ఇవ్వడం అన్యాయం. కేంద్రం నుంచి తెచ్చుకుంటున్న నిధులను ఏమి చేస్తున్నారో రాయలసీమకు పైసా ఖర్చు చేయడంలేదు.

– కేసీ రాముడు, సీనియర్ న్యాయవాది, కర్నూలు

ప్రైవేటీకరిస్తే ఊరుకోం

పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్మాణానికి వ్యతిరేకం

- ప్రభుత్వ సొమ్మును అనుచరులకు దోచిపెట్టడానికే ప్రైవేటీకరణ
- దీని వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతోంది
- సంపద సృష్టిస్తామని ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తే ఎలా?
- స్పార్క్, జన విజ్ఞాన వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఆగ్రహం
- ప్రభుత్వ నిధులతోనే మెడికల్ కాలేజీల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్పార్క్ కన్వీనర్ శివనాగిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోమని, తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తోందని రాజకీయ, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడాన్ని తీవ్రంగా తప్పుబట్టాయి. వెంటనే అందుకోసం విడుదల చేసిన జీఓలు 107,108లను రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. రాజ్యాంగం ప్రకారం విద్య, వైద్య విభాగాలను ప్రభుత్వమే నిర్వహించాలని, అయితే, కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా తమ అనుకూల వ్యక్తులకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకుందని వక్తలు మండిపడ్డారు. మంగళవారం జెడ్పీలోని ఎంపీపీ హాలులో స్పార్క్, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు అప్పగించడాన్ని నిరసిస్తూ రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్పార్క్ కన్వీనర్ శివనాగిరెడ్డి, కోకన్వీనర్, జాన్‌బాబు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. సాగునీటి సంఘం నాయకులు శేషాద్రిరెడ్డి, రిటైర్డ్ ఎకానమీ ప్రొఫెసర్ ఎస్ఏ రహమాన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు లాజరస్ తదితరులు కూటమి సర్కారు ప్రతీది ప్రైవేట్ పరం చేస్తుందని, కలిసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

పీపీపీ.. ఫెయిల్యూర్ మోడల్

పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఫెయిల్ అయ్యాయి. ఆ విధానాన్ని తెచ్చి ప్రభుత్వం మనపై రుద్దుతోంది. ఈ విధానంలో మెడికల్ కాలేజీలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులు వారి ఆధీనంలోకి వెళ్తాయి. ఫలితంగా పేదలకు ఉచిత వైద్యం అందదు. మెడికల్ కాలేజీల్లో చేరే పేద విద్యార్థులకు లక్షల ఫీజులు ఉంటాయి.

– డాక్టర్ హరి, జూడా రాష్ట్ర కార్యదర్శి

పేదలకు అందని ద్రాక్షగా వైద్య విద్య

గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒకేసారి 2,500 వైద్య సీట్లు అందుబాటులోకి వస్తాయి. సులభంగా పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలు వైద్యవిద్య అభ్యసించగలుగుతారు. అదే ప్రైవేట్ పరం చేస్తే పేద విద్యార్థులు కోట్ల రూపాయలు పెట్టి సీట్లు కొనుగోలు చేయాలి. అంత డబ్బు పేదల పిల్లలు పెట్టలేరు.

– జహంగీర్,ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

ప్రైవేట్‌కు అప్పగించడానికి సీపీఐ వ్యతిరేకం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుంది. ఈ విధానంలో పేదలకు ఉచిత వైద్యం అందదు. పేద విద్యార్థులు మెడికల్ విద్యను అభ్యసించలేరు. ఇప్పటికే పీపీపీ మోడల్‌ను వ్యతిరేకిస్తూ పార్టీ తీసుకున్న నిర్ణయంతో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిత్యం పోరాటాలు జరుగుతున్నాయి. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎవరూ పోరాటం చేసినా మేము మద్దతు ఇస్తాం.

– ఎస్.మునెప్ప, జిల్లా సహాయ కార్యదర్శి, కర్నూలు

ప్రలోభాలతో మోసం చేయడం తగదు



కామన్‌దొడ్డి గ్రామంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం నాయకులు

కోసిగి: కూటమి నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి సామాన్య ప్రజలను ప్రలోభాలతో మోసం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం నాయకులు నరసింహులు గౌడ్, గ్రామ సర్పంచ్ మునెమ్మలు విమర్శించారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన 90 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరినట్లు హడావుడి చేయడం తగదన్నారు. మంగళవారం కామన్‌దొడ్డి గ్రామంలో గ్రామ సర్పంచ్ మునెమ్మ ఆధ్వర్యంలో ఎవరైతే పార్టీ వీడారని చెప్పారో వారే తిరిగి గ్రామానికి చెందిన హరిజన అడివప్ప, యల్లప్ప, అబ్రహం, పరమేష్, దాసరి అంజినయ్య, పింజారి బాషా, రహిమాన్, ఉసేనిలతో పాటు మరో 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులు ఇంటి స్థలం మంజూరుపై మాట్లాడేందుకు పిలిపించి తమకు పార్టీ కండువాలు వేశారన్నారు. అంతేకానీ పార్టీ కండువాలు వేస్తారంటే వెళ్లే వాళ్లం కాదన్నారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి వెంటే ఉంటామని, వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదన్నారు. ఎవరూ కూటమి నాయకుల ప్రలోభాలకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బషీర్, నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని..

ఆళ్లగడ్డ: మండలంలోని నల్లగట్ల, బత్తలూరు గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఆవుల కుమార్ (25) అనే యువకుడు మృతి చెందాడు. నల్లగట్ల గ్రామానికి చెందిన కుమార్, నరసింహులు ఎర్రగుంట్లకు వెళ్లి పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి మోటర్‌సైకిల్‌పై వస్తుండగా బత్తలూరు దాటిన తరువాత వెనుకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా నరసింహ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



బస్తిపాడు సమీపంలో పచ్చని పంట పొలాల మధ్య ప్రవహిస్తున్న హంద్రీనది



రాజ్‌విహార్ బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తూ..



జొహరాపురం వద్ద తుంగభద్ర నదిలో కలుస్తున్న హంద్రీనది నీరు

గలగల పారుతూ..

గత కొద్ది రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిప్రవహిస్తున్నాయి. నదులకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఇటీవలే గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడంతో హంద్రీనది పోటెత్తింది. పచ్చని పంట పొలాల మధ్య గలగల పారుతూ కల్లూరు మండలం రెమడూరు, పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, పందిపాడు మీదుగా కర్నూలు నగరంలోని జొహరాపురం వద్ద తుంగభద్రనదిలో కలుస్తున్న దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

చిన్నవంచె వాగులో యువకుడి గల్లంతు

- లభ్యమైన మృతదేహం



మృతి చెందిన జమాల్‌బాషా



వాగులో నుంచి బైక్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు సమీపంలో ప్రవహిస్తున్న చిన్నవంచెవాగులో మంగళవారం ఓ యువకుడు గల్లంతయ్యాడు. సీఐ హనుమంతునాయక్ అందించిన సమాచారం మేరకు.. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన మునీర్ కుమారుడు షేక్ జమాల్‌బాషా(20) సంజామల మండలం ముదిగేడులో సెంట్రింగ్ పనులు ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇంటి నుంచి ఉదయం బైక్‌పై లింగాల మీదుగా వల్లంపాడు సమీపంలో ఉన్న చిన్నవంచె వాగు దాటుకుని వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని ఇదే రహదారిలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వల్లంపాడు సమీపంలో ఉన్న కుందూ నదికి వరదనీరు పోటెత్తింది. నదికి అనుసంధానంగా ఉన్న వాగులో క్రమంగా నీటి ఉధృతి పెరిగింది. అది గమనించని యువకుడు బైక్‌పై వాగు దాటే ప్రయత్నంలో నీటి ప్రవాహానికి బైక్‌తో సహా కొట్టుకపోయాడు. ఈత రాకపోవడంతో ప్రవాహంలో కొట్టుకపోతూ కొంతదూరంలో వాగులో ముళ్లపొదలను పట్టుకుని కేకలు వేశాడు. రజకులు గమనించి వాగులో దిగి కాపాడే ప్రయత్నం చేయగా చేతితో పట్టుకున్న ముళ్లపొదలు జారిపోవడంతో నీటిలో కొట్టుకపోయి మునిగిపోయాడు. విషయం తెలిసిన వెంటనే సీఐతో పాటు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గజఈతగాళ్లసాయంతో వాగులో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. గత నెల 30వ తేదీన అదేప్రాంతంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలరాం జిల్లా గొండిపూర్‌కు చెందిన లవ్‌కుశ్ అనే యువకుడు బైక్‌పై వాగు దాటుతూ నీటిలో గల్లంతై మృత్యువాత పడ్డాడు. సరిగ్గా నెల రోజులకే మరో యువకుడు అదే వాగులో కొట్టుకపోయి మృతి చెందటం విచారకరం. వాగులో పడ్డ బైక్‌ను స్థానికులు వెలికి తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ వివరించారు.

పత్తి రైతు చిత్తు

- నకిలీ విత్తనాలతో కిలో దిగుబడి కూడా రాని వైనం



ఈ చిత్రంలోని రైతు పేరు గొల్ల వెంకటలింగం. ఓర్వకల్ మండలం నన్నూరు గ్రామానికి చెందిన పత్తి రైతు. నందికొట్కూరులోని భ్రమరాంబ మల్లికార్జున సీడ్స్ దుకాణంలో ఈ ఏడాది జూన్ 6వ తేదీన రాయల్ సీడ్స్ కంపెనీకి చెందిన రణధీర్ బీజీ-2 రకం పత్తి విత్తనాలు (475 గ్రాములు) ప్యాకెట్ రూ.850 ప్రకారం 11 ప్యాకెట్లు కొని మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. మందులు తదితర వాటికి పెట్టుబడిగా రూ.లక్షకుపైగా పెట్టాడు. ఇప్పటికే పత్తి సాగు చేసిన రైతులు మొదటి విడత పత్తి తీసి.. రెండో దఫా కూడ పత్తి తీయడానికి సిద్ధమవుతున్నారు. ఈ రైతు సాగు చేసిన పత్తిలో మాత్రం ఇంతవరకు కిలో పత్తి కూడా తీయలేదు. పూత వచ్చినప్పటికి చెట్టుపైనే వాడిపోయి రాలిపోతోంది. అక్కడక్కడ కాయలు వచ్చినా...కుళ్లిపోతున్నాయి. దిగుబడి పెంచుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నా... ఫలితం లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు తన అవస్థ చెప్పుకునేందుకు మంగళవారం కుమారుడు హరికృష్ణతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చాడు. అయితే సెలవు దినం కావడం.. అధికారులెవ్వరూ కనిపించకపోవడంతో విలేకర్లకు తన గోడు చెప్పుకొని కన్నీరుమున్నీరయ్యాడు. నకిలీ పత్తి విత్తనాలు ఇవ్వడంతోనే తనకు నష్టం జరిగిందని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని పరిహారం ఇప్పించాలని కోరారు.

– కర్నూలు(అగ్రికల్చర్)

గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు

- గొర్రెల కాపరితో పాటు 25 జీవాలు మృతి



ఎల్లరాముడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి సాయిబాబా గుడి దగ్గర గొర్రెల మందపై కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో 25 గొర్రెలతో పాటు గొర్రెల కాపరి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..బస్తిపాడు గ్రామానికి చెందిన కురువ ఎల్లరాముడు (34), మరో ముగ్గురు సాయిబాబా గుడి ఎదురుగా గొర్రెల మందను మేపుతున్నారు. కర్నూలు నుంచి డోన్ వైపు అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను గుద్దుకుంటూ రహదారి ఇవతల వైపు ఉన్న గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి ఎల్లరాముడు అక్కడికక్కడే మృతి చెందగా 25 గొర్రెలు మృతి చెందాయి. మరో 22 గొర్రెలు గాయపడ్డాయి. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ధనుంజయ తెలిపారు. కాగా మృతుడికి నాలుగురు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో కుటుంబ సభ్యుల, బంధువుల రోదనలు మిన్నంటాయి.

విరిగిపడ్డ కొండచరియలు



కింద పడిన బండరాళ్లు



కూలిపోయిన విద్యుత్ స్తంభాలు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఎగువ అహోబిలంలో మంగళవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. సోమవారం అర్ధరాత్రి అనంతరం కురిసిన భారీ వర్షానికి దేవాలయం వెళ్లే మెట్లమార్గంలో కొండపై నుంచి భారీ బండరాయి విరిగి కిందపడింది. ఈ ప్రమాదంలో పెద్ద చెట్టు, కరెంట్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ తీగలు తెగి దారికి అడ్డంగా పడ్డాయి. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కనుల పండువగా మంచాలమ్మ తెప్పోత్సవం



పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం

మంత్రాలయం : ఓవైపు వేద మంత్రాల ఘోష, మరో వైపు మంగళవాయిద్యాల సుస్వరాలు.. ఇంకోవైపు భక్తజనుల హర్షధ్వానాల మధ్య గ్రామ దైవం మంచాలమ్మ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ముందుగా అమ్మవారిని శ్రీమఠం ఈశాన్య భాగంలోని పుష్కరిణి వరకు మంగళవాయిద్యాలతో తీసుకెళ్లారు. పుష్కరిణి మంటపంలో శాస్త్రోక్తంగా పీఠాధిపతి పూజలు చేపట్టారు. పీఠాధిపతి ప్రవచనం అనంతరం అమ్మవారిని తెప్పపై ఆశీనులను గావించారు. వేదమంత్రోచ్చారణ పఠిస్తూ సుందరంగా అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రభపై అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవ వేడుకలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోన్ టౌన్: డోన్ పాత బస్టాండ్ నుంచి పాతపేట మార్గంలో ఉన్న కర్నూలు రైల్వే గేట్ల సమీపంలో రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి (38) మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ ఎస్ఐ బిందుమాధవి తెలిపారు. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న డెమో రైలు మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో డోన్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. లోకో పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికుడి చేతిపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు, ఎడమ భుజంపై 'శివమణి' అనే పచ్చబొట్టు ఉన్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 90304 81295 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.




రన్నరప్ బోపన్న-యుజికి జోడీ

కెరీర్‌లో 27వ డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్నకు నిరాశ ఎదురైంది. టోక్యోలో మంగళవారం ముగిసిన జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-టకెరు యుజికి (జపాన్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. హ్యూగో నిస్ (మొనాకో)-ఎడువార్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటతో జరిగిన డబుల్స్ ఫైనల్లో బోపన్న-యుజికి ద్వయం 5-7, 5-7తో పోరాడి ఓడిపోయింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-యుజికి ఆరు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌లను ఒకసారి బ్రేక్ చేశారు. రన్నరప్ బోపన్న-యుజికి జంటకు 72,940 డాలర్ల (రూ. 64 లక్షల 79 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 300 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. విజేతగా నిలిచిన హ్యూగో నిస్-వాసెలిన్ ఖాతాలో 1,36,760 డాలర్ల (రూ. 1 కోటీ 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి. 45 ఏళ్ల బోపన్న తన డబుల్స్ కెరీర్‌లో 64 టోర్నీల్లో ఫైనల్‌కు చేరాడు. 26 టోర్నీల్లో విజేతగా, 38 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.

ప్రదానం చేయలేదని.. ఎప్పటికీ పంపరా?

ఏసీసీ చీఫ్ నఖ్వీ ట్రోఫీ డ్రామాపై బీసీసీఐ ఆక్షేపణ ● ఏజీఎంలో తీవ్రస్థాయిలో అభ్యంతరం


రాజీవ్ శుక్లా


నఖ్వీ

దుబాయ్: ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) అధ్యక్షుడి వ్యవహార శైలిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మండిపడింది. మంగళవారం ఇక్కడ ఏసీసీ సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఇందులో భారత బోర్డు తరఫున సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ కోశాధికారి ఆశిష్ షెలార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధ్యక్షుడు కూడా అయిన ఏసీసీ చీఫ్ మోసిన్ నఖ్వీ విపరీత ధోరణిపై బీసీసీఐ ప్రతినిధులిద్దరు ఆక్షేపించారు. నఖ్వీ పాక్ ప్రభుత్వంలో మంత్రి కూడా కావడంతో టీమిండియా అతని చేతుల మీదుగా జరగాల్సిన ట్రోఫీ ప్రదానోత్సవాన్ని సున్నితంగా తిరస్కరించింది. ఆదివారం రాత్రి తను ప్రదానం చేయలేదన్న అక్కసుతో నఖ్వీ తర్వాత కూడా విజేత భారత జట్టుకు పంపకుండా ఏసీసీ కార్యాలయంలోనే అట్టిపెట్టాడు. దీంతో 'కప్' లేకుండానే భారత క్రికెట్ జట్టు సభ్యులు స్వదేశానికి వచ్చారు. మంగళవారం జరిగిన ఏజీఎంలో నఖ్వీ కొనసాగిస్తున్న 'ట్రోఫీ డ్రామా'పై శుక్లా, షెలార్ తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది ఏసీసీ ట్రోఫీ. ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. వ్యక్తిగతంగా ఎవరికి చెందదు. టోర్నీలో గెలిచిన విజేత జట్టుకే అప్పగించాలి' అని రాజీవ్ శుక్లా గట్టిగానే స్పష్టం చేశారని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. ఏజీఎంలో ఇంత జరుగుతున్నా... భారత్ నుంచి తీవ్రస్థాయిలో అభ్యంతరం వెల్లువెత్తుతున్నా... ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ మాత్రం ఇంకా తన మొండి పట్టు వీడటం లేదు. ట్రోఫీని ఇచ్చేందుకు సమావేశంలో అంగీకరించలేదని తెలిసింది. ట్రోఫీ గురించి ఏజీఎంలో చర్చించాల్సిన అవసరం లేదని, మరో సమావేశంలో మాట్లాడుకుందామని నఖ్వీ దాటవేశారు. ఏసీసీ ఎజెండాలోని వైస్ చైర్మన్ ఎన్నిక వరకే ఈ మీటింగ్‌ను పరిమితం చేయాలని చూశారు. అంతేకాదు. వెస్టిండీస్‌పై నేపాల్ సంచలన విజయం పట్ల నేపాల్ జట్టును అభినందించారు. నేపాల్ ఆసియా జట్టు కావొచ్చు. కానీ ఆ ద్వైపాక్షిక సిరీస్ ఏసీసీకి సంబంధించిన టోర్నీ కానేకాదు. అయినా నేపాల్‌ను ప్రశంసించిన నఖ్వీ... ఏసీసీ సొంత టోర్నీ అయిన ఆసియా కప్ గెలిచిన భారత్‌ను మాటమాత్రంగానైనా అభినందించకుండా తన కుటిల బుద్ధిని చాటుకున్నారు. మొత్తానికి ఆసియా కప్ ట్రోఫీ మాత్రం ఇంకా ఏసీసీ కార్యాలయంలోనే ఉంది.

జాతీయ క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలను గౌరవించేందుకు ఉద్దేశించిన జాతీయ క్రీడా పురస్కారాలు-2025 కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏటా ఇచ్చే ఈ అవార్డుల కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు అక్టోబర్ 28వ తేదీ. క్రీడారంగంలో వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు, అర్జున అవార్డు, అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం), ద్రోణాచార్య అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ (ఆర్‌కేపీపీ) పురస్కారాలను అందజేస్తారు. క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రత్యేక పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. అవార్డుల మార్గదర్శకాలు, ఇతర వివరాల కోసం మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ www.dbtyas-sports.gov.in ను చూడాలని కోరింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

దీప్తి ఆల్‌రౌండ్ షో

భారత మహిళల శుభారంభం
- శ్రీలంకపై 59 పరుగులతో జయభేరి
- రాణించిన హర్లీన్, అమన్‌జోత్
- ఈనెల 5న పాకిస్తాన్‌తో టీమిండియా పోరు
- మహిళల వన్డే ప్రపంచకప్



అమన్‌జోత్‌తో నడిపించి... బౌలింగ్‌తో గెలిపించి...

గువాహటి: సొంతగడ్డపై అట్టహాసంగా ఆరంభమైన వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లో కీలక వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. దీంతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 59 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్... వర్షం వల్ల కుదించిన 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (53 బంతుల్లో 53; 3 ఫోర్లు), అమన్‌జోత్ కౌర్ (56 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), రాణించారు. లంక బౌలర్లలో ఇనోక రణవీర 4 వికెట్లు, ప్రబోధని 2 వికెట్లు తీశారు. అనంతరం దిగిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (47 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడింది. దీప్తి (3/54) సహా భారత బౌలర్లు స్నేహ్ రాణా (2/32), ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శ్రీచరణి (2/37), క్రాంతి (1/41), అమన్‌జోత్ (1/37), ప్రతిక (1/6) సమష్టిగా ప్రత్యర్థి బ్యాటర్ల భరతం పట్టారు.

భారత వెటరన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోకు శ్రీలంక కుదేలైంది. ప్రతీక (37; 3 ఫోర్లు, 1 సిక్స్), **హర్లీన్ డియోల్ (64 బంతుల్లో 48; 6 ఫోర్లు) మెరుగ్గా ఆడినప్పటికీ మరోవైపు కీలక స్టార్లు స్మృతి మంధాన (8), హర్మన్‌ప్రీత్ (21), జెమీమా (0), రిచా ఘోష్ (2) విఫలమవడంతో 124/6 స్కోరు** వద్ద భారత్ పనైపోయిందనిపించింది. ఈ దశలో దీప్తి, అమన్‌జోత్‌తో కలిసి భారత్‌ను నడిపించింది. లంక అమ్మాయిల చెత్త ఫీల్డింగ్‌తో అమన్‌జోత్ మూడుసార్లు 18, 37, 50 పరుగుల వ్యక్తిగత స్కోర్ల వద్ద అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడింది. ఇద్దరు అర్ధసెంచరీ పూర్తి చేసుకొని జట్టును ఒడ్డుకు చేర్చారు. ఏడో వికెట్‌కు 99 బంతుల్లో 103 పరుగులు జోడించాక ముందుగా అమన్‌జోత్, అనంతరం దీప్తి అవుటయ్యారు. ఆఖర్లో స్నేహ్ రాణా (15 బంతుల్లో 28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించింది. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయి ఓటమిని ఆహ్వానించింది. ఓపెనర్, కెప్టెన్ చమరి ఆటపట్టు, వన్‌డౌన్ బ్యాటర్ హర్షిత (29; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో నీలాక్షిక సిల్వా (29 బంతుల్లో 35; 4 ఫోర్లు; 1 సిక్స్) మెరుగ్గా ఆడారంతే! మిగతా బ్యాటర్లను భారత బౌలింగ్ దళం క్రీజులో నిలువనీయలేదు.

ప్రపంచకప్‌లో నేడు
ఆస్ట్రేలియా X న్యూజిలాండ్
వేదిక: ఇండోర్
మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతిక రావల్ (సి) విష్మి (బి) ఇనోక 37; స్మృతి మంధాన (సి) విష్మి (బి) ప్రబోధని 8; హర్లీన్ డియోల్ (సి) దిల్హారి (బి) ఇనోక 48; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) సంజీవని (బి) ఇనోక 21; జెమీమా రోడ్రిగ్స్ (బి) ఇనోక 0; దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) అచిని 53; రిచా ఘోష్ (సి) ప్రబోధని (బి) చమరి 2; అమన్‌జోత్ (సి) విష్మి (బి) ప్రబోధని 57; స్నేహ్ రాణా (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (47 ఓవర్లలో 8 వికెట్లకు) 269. వికెట్ల పతనం: 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269.

బౌలింగ్: అచిని కులసూర్య 8-0-42-1, ఉదేషిక ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, కవిశా దిల్హారి 8-0-51-0, ఇనోక రణవీర 9-0-46-4, చమరి 3-0-24-1.

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని (బి) క్రాంతి గౌడ్ 14; చమరి (బి) దీప్తి శర్మ 43; హర్షిత (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీచరణి 29; విష్మి గుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) అమన్‌జోత్ 11; కవిశా (సి) రిచా ఘోష్ (బి) దీప్తి 15; నీలాక్షిక (బి) స్నేహ్ రాణా 35; అనుష్క (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 6; సుగంధిక (బి) స్నేహ్ రాణా 10; అచిని (సి) స్మృతి (బి) శ్రీచరణి 17; ప్రబోధని (నాటౌట్) 14; ఇనోక రణవీర (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రతిక రావల్ 3; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (45.4 ఓవర్లలో ఆలౌట్) 211. వికెట్ల పతనం: 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211.

బౌలింగ్: క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక 2.4-0-6-1.

తిలక్ వర్మకు సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో తిలక్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశాడు. పాకిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ అజేయ అర్ధ సెంచరీ సాధించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ సందర్భంగా తిలక్ వర్మ సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను, జెర్సీని అందజేశాడు. తిలక్ ఇచ్చిన బ్యాట్‌తో రేవంత్ రెడ్డి క్రికెట్ షాట్ కొడుతున్న ఫోజు పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి, 'శాట్స్' ఎండీ సోనీ బాలాదేవి, సీఎం ముఖ్యకార్యదర్శి శ్రీనివాస్ రాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆశలు వమ్ము చేయకూడదని...

శేరిలింగంపల్లి: పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఎంతో ఒత్తిడి ఉన్నా... ప్రత్యర్థి ఆటగాళ్లు ఎంత రెచ్చగొట్టినా... ఎక్కడా సంయమనం కోల్పోలేదని... వారికి తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చానని తిలక్ వర్మ వ్యాఖ్యానించాడు. చిన్ననాటి నుంచి తాను ప్రాక్టీస్ చేసిన శేరిలింగంపల్లిలోని లేగలా క్రికెట్ అకాడమీకి మంగళవారం తిలక్ వచ్చాడు. ఈ సందర్భంగా తన కోచ్ సలామ్ బాయష్, అకాడమీ ఎండీ పృథ్వీ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'కోట్లాది మంది భారతీయుల ఆశలను వమ్ము చేయకూడదనుకున్నాను. చివర్లో ఒత్తిడి వచ్చినా... దేశం కోసం ఆడాలి, గెలిపించాలన్న లక్ష్యంతో ఓపికగా ఆడాను. హెడ్ కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎంతో ప్రోత్సహించారు. నేనీ స్థాయికి చేరుకోవడం వెనుక కోచ్ సలామ్, పృథ్వీ పాత్ర ఎంతో ఉంది. ఈ ఇద్దరినీ ఎప్పటికి మర్చిపోలేను. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలి. ఈ విషయంలో కోహ్లి, రోహిత్ శర్మలు ఆదర్శం' అని తిలక్ తెలిపాడు.

సాక్షి సినిమా


● సమంత

జ్ఞాపకాలను మోయడం ఆపేశాను


''నా ఇరవయ్యేళ్ల వయసులో విశ్రాంతి లేకుండా గందరగోళంలో గడిపాను... గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. నా ఫీలింగ్స్ ఏవీ పైకి కనిపించకుండా ఉండేందుకు కష్టపడ్డాను. ఈ క్రమంలో నన్ను నేను ఎంత కోల్పోయానో నాకు మాత్రమే తెలుసు. ఆ సమయంలో ప్రేమ గురించి నాకెవరూ చెప్పలేదు. కానీ నిజమైన ప్రేమ మనలోనే దాగి ఉంటుందని, మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమైన ప్రేమ అని ఆ తర్వాత అర్థం చేసుకున్నాను'' అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ఆలోచనలను, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తన ఫ్యాన్స్‌తో షేర్ చేసుకుంటుంటారు సమంత. తన మేకప్‌మేన్‌తో ఓ సుదీర్ఘమైన చర్చ జరిగిందని, ఈ చర్చలో ఎన్నో అంశాలను మాట్లాడుకున్నామని పేర్కొని, వాటిలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ, ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేశారు సమంత. ''ముప్పైఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారిపోతుంది. మీ అందంలో మార్పులొస్తాయి. ఇప్పుడు నేను ముప్పై ఏళ్లలో ఉన్నాను. ప్రతి దాని వెంట పరుగులు పెట్టడం ఆపేసి, జీవితాన్ని ఆస్వాదిస్తున్నాను. గతంలో నేను చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం ఆపేశా. పబ్లిక్‌లో ఒకలా... ఒంటరిగా ఉన్నప్పుడు మరోలా... ఇలా రెండు రకాలుగా ఉండటం మానేశాను. ఎందుకంటే మీరు మీలా ఉన్నప్పుడే హ్యాపీగా... స్వేచ్ఛగా జీవించగలరు'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు సమంత.

కెమెరా కాలింగ్


● మమ్ముట్టి

మలయాళ స్టార్ మమ్ముట్టి కొంత గ్యాప్ తర్వాత తిరిగి సినిమా సెట్స్‌లోకి అడుగు పెడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో మమ్ముట్టి తీవ్ర అస్వస్థతకు గురయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. కానీ మమ్ముట్టి ఆరోగ్య సమస్య స్వల్పమైనదేనని, ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని దర్శకుడు మహేశ్ నారాయణన్ పేర్కొన్నారు. మమ్ముట్టి, మోహన్‌లాల్ ప్రధాన పాత్రధారులుగా ఫాహద్ ఫాజిల్, కుంచాకో బోబన్ కీలక పాత్రల్లో నటిస్తున్న మలయాళ చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో మమ్ముట్టి అస్వస్థతకు గురయ్యారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ''జీవితంలో నాకు ఎంతో ఇష్టమైన పనిని (సినిమా షూటింగ్‌ని ఉద్దేశించి) తిరిగి ప్రారంభిస్తున్నాను. నా ఆబ్సెన్స్‌లో నా గురించి తెలుసుకోవాలనుకున్న అందరికీ థ్యాంక్స్ చెప్పడానికి మాటలు సరిపోవు. ది కెమెరా ఈజ్ కాలింగ్'' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు మమ్ముట్టి. అలాగే ఈ విషయంపై మహేశ్ నారాయణన్ మాట్లాడుతూ– ''మమ్ముట్టిగారు తిరిగి సినిమా సెట్స్‌లోకి వస్తున్నందుకు థ్రిల్లింగ్‌గా ఉంది. రాబోయే షూటింగ్ షెడ్యూల్‌లో మమ్ముట్టి, మోహన్‌లాల్ కాంబినేషన్‌లోని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ఇన్ని రోజులు మమ్ముట్టిగారు సెట్స్‌కు రాకపోవడం వల్ల నష్టం వాటిల్లకుండా ఆయన లేని సీన్స్ చిత్రీకరించాం'' అని పేర్కొన్నారు.

నవంబరులో కొదమసింహం


● చిరంజీవి

చిరంజీవి కెరీర్‌లోని సూపర్ హిట్ చిత్రాల్లో 'కొదమసింహం' ఒకటి. కె. మురళీ మోహనరావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాధ, సోనమ్, వాణీ విశ్వనాథ్ హీరోయిన్లుగా, మోహన్‌బాబు విలన్ పాత్ర పోషించారు. కె. నాగేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం 1990 ఆగస్టు 9న విడుదలై, ఘన విజయాన్ని సాధించింది. ముప్పైఐదేళ్ల తర్వాత ఈ సినిమాని నవంబరు 21న రీ రిలీజ్ చేయనున్నట్లు రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు తెలిపారు. ''చిరంజీవి కౌబాయ్‌గా నటించి, ప్రేక్షకుల్ని అలరించిన చిత్రం 'కొదమసింహం'. రాజ్-కోటి సంగీతం, మోహన్‌బాబు వినోదం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రాన్ని 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా నవంబరు 21న రీ రిలీజ్ చేయబోతున్నాం'' అని కైకాల నాగేశ్వర రావు చెప్పారు.

అసురుల గురువు శుక్రాచార్యుడు


● అక్షయ్ ఖన్నా

'**హ**నుమాన్' మూవీ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో రూపొందిన తొలి చిత్రం 'హనుమాన్' (2024) పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ యూనివర్స్‌లో రూపొందుతోన్న ద్వితీయ చిత్రం 'మహాకాళి'. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షో రన్నర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అసురుల గురువు శుక్రాచార్యుడి పాత్రను బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పోషిస్తున్నారు. ఈ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఛావా' వంటి సూపర్ హిట్ మూవీలో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించి, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు అక్షయ్ ఖన్నా. తెలుగులో ఆయనకి 'మహాకాళి' తొలి చిత్రం. దేవతలు–దానవులు... ఇద్దరి భవితవ్యాన్ని మలిచిన శుక్రాచార్యుడిగా అద్భుతమైన పాత్ర పోషిస్తున్నారు అక్షయ్. 'మహాకాళి' షూటింగ్ 50 శాతం పూర్తయింది. డిసెంబరుకి మొత్తం పూర్తవుతుంది. ఇతర నటీనటులు, సినిమా విడుదల తేదీ వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

యాక్షన్... థ్రిల్


● విష్ణు విశాల్

విష్ణు విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ .కె దర్శకత్వం వహించారు. విష్ణు విశాల్ స్టూడియోస్‌పై శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మంగళవారం రిలీజ్ చేశారు. ''ఒక యునిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆర్యన్'. 'రాట్ససన్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. మా మూవీ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌లోకి తీసుకెళుతుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి ఇతర పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కెమెరా: హరీష్ కన్నన్, సంగీతం: జిబ్రాన్.


● దీపికా పదుకోన్

ఏడడుగులు వేసిన చిన్నారి పెళ్లికూతురు


● మిలింద్ చాంద్వానీ, అవికా గోర్

'**చి**న్నారి పెళ్లికూతురు' సీరియల్ ఫేమ్ అవికా గోర్ ఇప్పుడు నిజ జీవితంలో పెళ్లి పీటలెక్కారు. సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త మిలింద్ చాంద్వానీతో ఆమె ఏడడుగులు వేశారు. 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా గుర్తింపు సొంతం చేసుకున్న అవికా గోర్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారారు. తెలుగుతో పాటు కన్నడ, హిందీలో పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటించారు. గత ఆరేళ్లుగా ప్రేమలో ఉన్న మిలింద్, అవికా గోర్ జూన్‌లో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రేమికులు మంగళవారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

పరాక్... వింటేజ్ స్టైల్!


● శ్రీ మురళి

శ్రీ మురళి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పరాక్'. హలేష్ కోగుండి దర్శకత్వంలో బ్రాండ్ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. బెంగళూరులోని బండి మహాకాళి ఆలయంలో మంగళవారం ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకకు చన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవ రాజు ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మురళి మాట్లాడుతూ– ''పరాక్' ఒక వింటేజ్ స్టైల్ సినిమా'' అని అన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్‌రాజ్, కెమెరా: సందీప్ వల్లూరి.

వివాదాలు సృష్టించవద్దు! - ఫరా ఖాన్


● ఫరా ఖాన్

దర్శకురాలు ఫరా ఖాన్, హీరోయిన్ దీపికా పదుకోన్‌ల మధ్య అభిప్రాయభేదాలొచ్చాయని, అందుకే ఇన్‌స్టాలో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకున్నారన్నది బాలీవుడ్ టాక్. దీపిక కెరీర్‌లోని రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలు 'ఓం శాంతి ఓం' (2007), 'హ్యాపీ న్యూ ఇయర్' (2014)లో షారుక్ ఖాన్ హీరోగా నటించగా, ఫరా ఖాన్ దర్శకత్వం వహించారు. ఇలా దీపిక–ఫరాల మధ్య మంచి అనుబంధం ఉంది. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూ సందర్భంగా సినిమాల్లో హీరోయిన్స్ 8 గంటలే పని చేయాలన్నట్లుగా, 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' కాన్సెప్ట్ గురించి దీపిక మాట్లాడారు. ఈ కాన్సెప్ట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇటీవల ఓ షోలో పాల్గొన్న ఫరా ఈ 'ఎయిట్ అవర్స్ షిఫ్ట్' గురించి కాస్త వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో దీపికను ఉద్దేశించే ఫరా ఖాన్ అలా మాట్లాడారని, అందుకే వీరిద్దరూ ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో అయ్యారని ప్రచారమవుతోంది. ఈ ప్రచారంపై ఫరా స్పందించారు. ''హ్యాపీ న్యూ ఇయర్' సినిమా షూటింగ్ సమయంలోనే నేను, దీపిక ఇన్‌స్టాలో కాకుండా డైరెక్ట్ మెసేజ్ లేదా ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడాలనుకున్నాం. అప్పుడే మేం ఒకరినొకరం అన్‌ఫాలో అయ్యాం. కొన్ని వెబ్ పోర్టల్స్ కొత్త వివాదాలు సృష్టిస్తున్నారు'' అంటూ తన ఇన్‌స్టా స్టోరీలో ఫరా షేర్ చేశారు. ఈ స్టోరీకి ఓ నమస్కారం ఎమోజీతో దీపిక స్పందించారు.

పల్లెటూరి నేపథ్యంలో...


● స్వప్న, రామసత్యనారాయణ

తిలక్ రాజ్, తుంగ జంటగా నటించిన చిత్రం 'తాళికట్టు శుభవేళ'. వి. జగన్నాథ రావ్ దర్శకత్వంలో బి. అరుణ్ కౌశిక్ నిర్మించిన ఈ సినిమాలో దేవరాజ్ ముఖ్యపాత్ర పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, తుమ్మలపల్లి ఆంజనేయులు గుప్త, తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి హాజరై, 'తాళికట్టు శుభవేళ' వీడియో సాంగ్స్, ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''కొత్త తరానికి విలువలు నేర్పే మంచి కుటుంబ కథగా ఈ చిత్రం నిలిచిపోతుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు. ''పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. గ్రామీణ శైలిని ప్రతిబింబించే కథతో, వినోదం, భావోద్వేగాన్ని కలగలిపి రూపొందించాం'' అన్నారు వి. జగన్నాథ రావ్.